ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సత్తా

ట్రిపుల్ ఐటీలో చేరుతా



నా తల్లిదండ్రులు అప్పల నరసయ్య, హేమలతల ఆశలన్నీ నాపైనే. మా అన్న హరీష్ దివ్యాంగుడు. ఏమీ మాట్లాడలేడు, చదువులోలేడు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత లేక నన్ను చిట్టివలస హైస్కూల్‌లో తల్లిదండ్రులు చదివించారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అత్యధిక మార్కులు సాధించాను. ట్రిపుల్ ఐటీలో చేరుతాను. మంచి బ్యాంకు ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యం.

– బోర త్రిలోక్, చిట్టివలస హైస్కూల్

వైద్యురాలిని కావాలన్నదే కల



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు రామునాయుడు, కుమారి కష్టార్జితం, ప్రభుత్వ ప్రోత్సాహంతో లక్ష్మీపురం హైస్కూల్‌లో చదువుకున్నా. స్కూల్ సమయంలోనే కాకుండా ఇంటి వద్ద ఉన్నప్పుడు కూడా మా ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించి అధిక మార్కులు సాధించాను. ఇంటర్మీడియట్ లేదా ట్రిపుల్ ఐటీలో చేరుతాను. వైద్యురాలు కావాలన్నదే నా ఆశయం.

– కాళ్ల జ్ఞానేశ్వరి, లక్ష్మీపురం హైస్కూల్

సీఏ అవ్వడమే లక్ష్యం



నాన్న 2019లో చనిపోయారు. అప్పటి నుంచి అమ్మ స్వాతికళ కష్టపడి చదివించింది. ప్రైవేటు జాబ్ చేస్తూ మమ్మల్ని ఈ స్థాయికి తీసుకొచ్చింది. సీఏ పూర్తి చేయడమే లక్ష్యంగా చదువుతాను. ప్రయోజకురాలినై అమ్మ కలలు సాకారం చేస్తాను. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు రావడం చాలా ఆనందంగా ఉంది.

– కొమ్ముాజు భావనశ్రీ, చంద్రంపాలెం హైస్కూల్

తగరపువలస: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడుతూ అత్యుత్తమ మార్కులు సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన వసతులు సద్వినియోగం చేసుకుని విజయకేతనం ఎగురవేశారు. భీమిలి మండలంలోని 40 పాఠశాలల్లో కలిపి 86.92 శాతం ఉత్తీర్ణత నమోదయింది. మొత్తం 2,340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 2,034 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1,181 మందికి 921, ప్రైవేట్ పాఠశాలల్లో 1,159 మందికి 1,113 మంది ఉత్తీర్ణులయ్యారు.

- చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అత్యధిక మార్కులు లభించాయి. వీరిలో బోర త్రిలోక్ అత్యధిక మార్కులు సాధించారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడ పంచాయతీ మద్దిపేటకు చెందిన ఇతని తండ్రి అప్పలనరసయ్య దివీస్ లేబొరేటరీలో కాంటాక్ట్ కార్మికుడు కాగా తల్లి హేమలత గృహిణి. ఇదే పాఠశాలకు చెందిన జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట విద్యార్థి కె.వేదవ్యాస్ కార్తీక్ మంచి మార్కులు సాధించాడు.
- భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కాళ్ల జ్ఞానేశ్వరి అత్యధిక మార్కులు సాధించింది. ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు, గాడు పైడిరాజు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.
- మజ్జిపేట హైస్కూల్‌కు చెందిన గెద్ద జీవిత, సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థి జీరు చైతన్య ఉత్తమ మార్కులతో మెరిశారు. లక్ష్మీపురం హైస్కూల్ నుంచి బోని కావ్య, మొకర సతీష్, తాటితూరు హైస్కూల్ నుంచి కొంతల గోపిశ్రీ, సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థి ఇ.శ్యామలరావు, తాళ్లవలస హైస్కూల్ నుంచి షేక్ రిజ్వానా, చిట్టివలస బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కందివలస ప్రవళ్లిక మంచి మార్కులు సాధించినట్లు ఎంఈవో ఎం.శివరాణి తెలిపారు. 457 మందికి 384 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. బి.ఆర్.తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చందక జ్యోతి అధిక మార్కులు సాధించిందన్నారు. అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 97 శాతం, బి.ఆర్.తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 91.25, గంధవరం హైస్కూల్‌లో 88.24, మద్ది హైస్కూల్‌లో 93, పద్మనాభం హైస్కూల్‌లో 83.3, రెడ్డిపల్లి హైస్కూల్‌లో 90, రేవిడి హైస్కూల్‌లో 90, విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో మెరుపులు

సాధించారు.

భీమునిపట్నం: పాట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో 52 మందికి 34 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 43 మందికి 23 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే నెహ్రూ ఉన్నత పాఠశాలలో 52 మందికి 34 మంది ఉత్తీర్ణులయ్యారు. సెయింట్ అన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నుంచి 99 మంది హాజరుకాగా 93 మంది, సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నుంచి 45 మంది హాజరుకాగా 26 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బోని సాయి అత్యధిక మార్కులు సాధించాడు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 63 మంది పరీక్షలు రాయగా 27 మంది ఉత్తీర్ణత సాధించారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 35 మంది పరీక్షలు రాయగా 26 మంది ఉత్తీర్ణత సాధించారు.

పద్మనాభం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 84.03 శాతం ఉత్తీర్ణత

నేత్ర విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్ నేత్ర విద్యాలయంలో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. ఈ పరీక్షల్లో 12 మంది పరీక్షలు రాయగా 12 మంది ఉత్తీర్ణత సాధించారు. అనిల్ అత్యధిక మార్కులు సాధించాడు.

ఆనందపురం : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలో గల 11 హైస్కూళ్లు, ఒక కేజీబీవీ విద్యాలయం నుంచి 796 మంది పరీక్షలకు హాజరుకాగా 534 మంది ఉత్తీర్ణులై 67 శాతం ఉత్తీర్ణత సాధించారు. 90 శాతం ఫలితాలు సాధించి బోని హైస్కూల్ ప్రథమ స్థానంలో, 37 శాతం ఫలితాలు సాధించి గండిగుండం హైస్కూల్ ఆఖరి స్థానంలో నిలిచాయి. గొట్టిపల్లి హైస్కూల్‌లో చదివిన కె.హరిత, ఆనందపురం హైస్కూల్‌కు చెందిన లంక మధుప్రియ అత్యధిక మార్కులు సాధించారు. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 863 మంది పరీక్షలకు హాజరుకాగా 562 మంది ఉత్తీర్ణులయ్యారు. 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజబాబు, జయప్రద తెలిపారు. వాంబేకాలనీ సునీల్ శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 మందికి 21 మంది ఉత్తీర్ణులయ్యారు.

- కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 58 మంది పరీక్షలకు హాజరుకాగా 48 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 39 మంది ప్రథమ శ్రేణి సాధించారు. ఎస్.మోదప్రియాంక, డి.ప్రియాంక, వై.జస్సికా అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ టి.నాగమణి తెలిపారు.
- మారికవలసలోని ఏపీ గిరిజన గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 42 మందికి 41 మంది ఉత్తీర్ణులయ్యారు. 11 మంది 500పైన మార్కులు సాధించారు. కిల్లో నీలవేణి అత్యధిక మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు చెప్పారు.
- మారికవలస – తిమ్మాపురం రోడ్డులోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 74 మంది పరీక్షలకు హాజరుకాగా 59 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎస్.సాయికుమార్, కె.బలరామ్ 526 అత్యధిక మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు.

కస్తూర్బా విద్యార్థినుల జయకేతనం



ఎన్.భారతి, కేజీబీవీ, ఆనందపురం



ఇ.రేవతి, కేజీబీవీ, ఆనందపురం



కె.జస్వంతి, కేజీబీవీ, పద్మనాభం



కె.జాహ్నవి, కేజీబీవీ, భీమిలి

- భీమిలి, పద్మనాభంలో శతశాతం ఉత్తీర్ణత
- ప్రతిభకు అడ్డురాని పేదరికం

ఆనందపురం / పద్మనాభం / భీమునిపట్నం : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు సత్తా చాటారు. ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపించారు. నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభంలోని మూడు కేజీబీవీల్లోని విద్యార్థినులు విజయకేతనం ఎగురవేశారు.

- ఆనందపురం కస్తూర్బా విద్యార్థినులు 38 మంది పరీక్షలకు హాజరై 32 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఎన్.భారతి, ఇ.రేవతి అత్యధిక మార్కులు సాధించారు. భారతి స్వస్థలం మండలంలోని లొడగలవానిపాలెంకాగా తండ్రి నారాయణ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి పైడమ్మ రోజువారీ కూలిగా పనిచేస్తోంది. భారతి ఇక్కడ ఆరో తరగతిలో ప్రవేశం పొందింది. పెందుర్తి గ్రామానికి చెందిన రేవతి ఆరో తరగతిలో ప్రవేశం పొందింది. తల్లిదండ్రులు లక్ష్మి, శ్రీను వ్యవసాయ కూలీలు. వీరిద్దరూ చక్కగా చదువుకుని వైద్య విద్య అభ్యసించి డాక్టర్లు అవుతామని పేర్కొన్నారు.
- పద్మనాభం కస్తూర్బా విద్యాలయం నుంచి 36 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరై అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కె.జస్వంతి అత్యధిక మార్కులు సాధించింది.
- భీమిలి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 34 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కె.జాహ్నవి మంచి మార్కులు సాధించింది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ గంగాకుమారి అభినందించారు.

వైద్య విద్యే లక్ష్యం



మా నాన్న భవన నిర్మాణ పనులు చేస్తూ, అమ్మ లక్ష్మి ఇంటి పని చూసుకుంటూ నన్ను, అన్నయ్యను చదివిస్తున్నారు. మా పంచాయతీలో ఇటీవల పదుల సంఖ్యలో వైద్య వృత్తిలో రాణిస్తున్నారు. నేను కూడా అదే లక్ష్యంతో చదవాలనుకుంటున్నాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించగలిగాను.

– బోని కావ్య, లక్ష్మీపురం హైస్కూల్

ఐటీ డెవలపర్ అవుతా



గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి సంస్థల్లో ఐటీ డెవలపర్ కావాలని ఉంది. ముందుగా ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఐఐటీలో చదువే లక్ష్యంగా ముందుకు వెళ్తాను. చిట్టివలస హైస్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈశ్వర వీరకుమార్, కనక మహాలక్ష్మి ప్రోత్సాహంతోనే అత్యధిక మార్కులు సాధించగలిగాను.

– కొట్యాడ వేద వ్యాస్ కార్తీక్, చిట్టివలస హైస్కూల్

ఉపాధ్యాయుల సహకారంతోనే...



చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించడానికి మా ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది. పాఠాలు ఏ విధంగా చదివితే అర్థమవుతాయి, మంచి మార్కులు ఎలా వస్తాయన్న విషయాలు చాలా చెప్పేవారు. ట్రిపుల్ ఐటీలో చేరుతాను. రాబోయే రోజుల్లో చక్కగా చదివి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలన్నదే లక్ష్యం.

– కె.నిహారిక, ఏపీ రెసిడెన్షియల్, భీమిలి

ఐఏఎస్ సాధించి తీరుతా



ప్రస్తుతం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించినట్టే ఇంటర్, డిగ్రీల్లో కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా. ఐఏఎస్ అధికారి కావడమే నా ధ్యేయం. అందుకోసం పట్టుదలతో తీవ్రంగా కృషి చేసి సాధిస్తాను.

– ఎస్.సౌజన్య, ఏపీ గురుకులం, భీమిలి

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోపాటు తోటి విద్యార్థులు ఎంతగానో సహకరించడం వల్లే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. ట్రిపుల్ ఐటీలో చేరి చక్కగా చదువుతాను. భవిష్యత్‌లో మంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యం

– ఎం.తేజశ్రీ, ఏపీ గురుకులం, భీమిలి

మంచి ఇంజినీర్ అవుతా



ఇంజినీర్ కావాలన్నది మా కుటుంబ సభ్యుల కోరిక. అందుకు తగినవిధంగా చక్కగా చదువుకుని మంచి ఉద్యోగంలో స్థిరపడతాను. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించాను.

– బోని సాయి, సీబీఎం ఎయిడెడ్ పాఠశాల, భీమిలి

సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతా



మాది అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం. నాన్న కూలి పనిచేసి నన్ను చదివిస్తున్నారు. మా తల్లిదండ్రుల కలలు నెరవేరుస్తాను. ఐఐటీలో సీటు సాధించి కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతాను.

– ఎస్.మోద ప్రియాంక, బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈ, మధురవాడ.

ఐఏఎస్ ఆఫీసర్ అవుతా



అమ్మ ఈశ్వరి ప్రైవేటు ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఎంప్లాయ్‌గా పనిచేస్తూ నన్ను చదివించింది. కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాను. ఐఏఎస్ ఆఫీసర్ కావాలన్నదే లక్ష్యం. చక్కగా చదివి అమ్మ కలలు నెరవేరుస్తాను.

– మనోజ్ఞ, చంద్రంపాలెం హైస్కూల్

క్లుప్తంగా

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ఆనందపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి టీవీఎస్ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 11 వరకూ ఈ శిబిరాన్ని గ్రంథాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ నిర్వహించనున్నామని చెప్పారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, అముద్రిత కథలు (ముద్రణకు నోచుకోని), పేపర్ క్రాఫ్ట్, కథలు చెప్పడం వంటి అంశాలు ఉంటాయని, ఆసక్తి గల వారు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

గిరిజన ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రవేశాలకు పరీక్ష నేడు

మధురవాడ: మారికవలస – తిమ్మాపురం రోడ్డులోని ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు. 5వ తరగతిలో ప్రవేశానికి, ఇతర తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశాలకు పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుంది. ఈ పరీక్షలకు ముందు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోలేని వారు కూడా విద్యార్హత ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావచ్చునని శివప్రసాద్ చెప్పారు. ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో గల విశ్వనాథా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అపోలో ఫార్మసిస్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించగా సుమారు 200 మంది హాజరయ్యారు. వివిధ పరీక్షల అనంతరం 25 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి ఎ.సునీతాదేవి, ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి, హెచ్ఆర్ మంగ నాగశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా అన్నదానం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట గ్రామ దేవత శ్రీ ఎర్నిమాంబ ఓడ ఊరేగింపు మారువారం సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

యువకుడు అదృశ్యం



చిన్నంనాయుడు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామానికి చెందిన గంట్యాడ సీతంనాయుడు (33) అదృశ్యమైనట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. మూడు నెలల నుంచి సీతంనాయుడు కనిపించకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. తల్లి సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తలిపారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 814వ రోజు శనివారం కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసమే హోమాలు



హోమం చేస్తున్న ఓంకార్ పీఠాధిపతి

మధురవాడ: లోక కల్యాణం కోసమే వివిధ రకాల హోమాలు నిర్వహిస్తున్నట్టు శ్రీరామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మహావ్రతయాజుల ధనుంజయరావు అన్నారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో శ్రీ రామలింగేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నక్షత్ర, నవగ్రహ, శ్రీరుద్ర హోమాలు నిర్వహించారు. విజయవాడ ఓంకార్ పీఠాధిపతులు ప్రమణిస్వామి ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా వివిధ రకాల హోమాలు నిర్వహిస్తున్నారు. వుడా కాలనీ, రెవెన్యూ కాలనీ, మధురవాడ పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమంలో మిథిలాపురి వుడా కాలనీ లే అవుట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తుల రాజు, ఎమ్‌వీ రమణమూర్తి, మహాదేవ కోటేశ్వరరావు, సమన్వయకర్త ఎ.శైలజ పాల్గొన్నారు.

బబ్బేలమ్మ ఉత్సవాలు ప్రారంభం

పీఎం పాలెం: బబ్బేలమ్మ అమ్మవారి ఉత్సవాలు శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాత పీఎంపాలెంలోని అమ్మవారి మూలరాట వద్ద భక్తులు పూజలు చేశారు. అనంతరం పీఎం పాలెం, లక్ష్మీవాని పాలెం ప్రాంతాల మహిళలు పిలకవానిపాలెం మీదుగా బంగారమ్మ గుడి వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాము గరిడీలు, మహిళల కోలాటం అలరించాయి.

ముగిసిన అచ్యుత పూజలు



అచ్యుత పూజల్లో స్థానికులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ దరి ఒమ్మివానిపాలెం సేవా గరిడి ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా అచ్యుత పూజలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా తొమడపు ఎద్దుల ఊరేగింపు, తిరువీధి మహోత్సవం, తొలిపాలగొలుపు ద్వారా సింహాద్రి అప్పన్న స్వామి మహిమలు వర్ణిస్తూ పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల గరిడీలు వేడుకల్లో పాల్గొనగా కార్పొరేటర్ లొడగల అప్పారావు, గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్, స్థానిక పెద్దలు చెట్టిపిల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి



రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు

తగరపువలస: అయిదేళ్లు దాటిన బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. జగనన్న బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదిస్తూ ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత వివరించారు. రామన్నపేట, రాజవీధి, బంగ్లామెట్ట గ్రామాల్లో తిరుగుతూ 1, 3, 4 తరగతులకు ఎనిమిది అడ్మిషన్లు చేశారు. అమ్మ ఒడి ప్రాధాన్యత వివరించారు. ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు, ఉపాధ్యాయులు మల్లిక, నాగమణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిరుగుడి ఆదినారాయణ, ఆలయ కమిటీ సభ్యులు

పద్మనాభం: మండలంలోని కృష్ణ చంద్ర బాబాజీ మఠం వద్ద అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 14న నిర్వహించనున్న హనుమాన్ జయంతి మహోత్సవాల వాల్ పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే రోజు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ అర్చకుడు ముద్దు రామశర్మ మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణం నుంచి మండలంలోని 22 పంచాయతీల్లో బైక్‌లతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు, ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి జగదీష్ బాబు, వాడపల్లి సీతారాం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



వాకర్స్‌తో కలిసి చెత్త సేకరిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. తగరపువలస రోడ్డులోని జమ్మిచెరువు పార్కు వద్ద శనివారం జమ్మిచెరువు వాకర్స్ క్లబ్ నిర్వహించిన స్వచ్ఛభారత్, శుభ్రత – పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పార్కులో చెత్త తొలగించేందుకు వాకర్స్ చేపట్టిన కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. ఇలా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే పారిశుధ్య సమస్యలు తలెత్తవన్నారు. త్వరలో ఈ పార్కులో రూ.85 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. పనులు పూర్తయితే ఎంతో అందంగా మారిపోతుందన్నారు. కార్యక్రమంలో దత్తి ఈశ్వరరావు, లక్ష్మీనారయణ, శ్యాంసుందర్, ముమ్మిడిశెట్టి సునీల్, సంకురుభుక్త జోగారావు, శంకరకుమార్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి



తహసీల్దార్ శ్రీవల్లీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీపీ గోపాల కృష్ణమూర్తిరాజు

పద్మనాభం: జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకానికి ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల జాబితాలో చేరిన బినామీలను తొలగించి నిజమైన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణ మూర్తి రాజు తహసీల్దార్ టి.శ్రీవల్లీకి శనివారం వినతిపత్రం ఇచ్చారు. జగనన్న పట్టణ గృహ నిర్మాణ పథకం కోసం తునివలస, నరసాపురం, గంధవరం గ్రామాల్లో సుమారు 340 ఎకరాల భూములను 360 మంది రైతులు ఇచ్చారని ఆయన తెలిపారు. అయితే కొంత మంది రైతులను నాయకులు భయపెంచి సుమారు 75 ఎకరాలకు సేల్ డీడ్ బలవంతంగా రాయించుకుని బినామీలుగా వారి పేర్లు రాయించుకున్నారని ఆరోపించారు. మరి కొంత మంది రైతులు వాస్తవంగా ఇచ్చిన భూమి విస్తీర్ణాన్ని తగ్గించి చూపించారని తెలిపారు. దీనివల్ల వారికి పరిహారం తగ్గిపోయిందని తెలిపారు. బినామీ పేర్లను తొలగించి దీర్ఘకాలంగా సాగుదారులుగా ఉన్న రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని కోరారు. అనర్హుల పేర్లు రికార్డుల్లో నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



వెంకటాపురంలో పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో రెండు రోజులు జరగనున్న హనుమాన్ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధన, పరిషత్ యాగశాల ప్రదక్షిణ, మండపారాధణ నిర్వహించారు. ఆదివారం హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. పూసర్ల రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, కర్రి శ్రీను పాల్గొన్నారు.